# గ్రీన్ తమ్

నేను క్లబ్ కి వెళ్ళడం కార్తీకపున్నానికో. మహాలయ అమావాశ్యకో. అదైనా "గోడని పట్టుకున్న బల్లిలా అలా ఎప్పుడూ ఇంట్లో తగలడకపోతే, చక్కా అలా క్లబ్బుకో, పార్కుకో అఘోరించకూడదూ" అన్న మా వారి గోల పడలేకే.

ఆవేళ క్లబ్ కి వెళ్ళక తప్పలేదు. మెంబర్లంతా హాజరుకావాలని మా ప్రెసిడెంటు తాకీదు జారీ చెయ్యడంవల్ల, ఆవిడమాట ఎవరూ కాదన్లేరు. ఆవిడ యూనిఫారం వేసుకుంటే మిలిటరీ మేజర్లా ఉంటుంది. ఇంక ఆర్గనైజింగు కెపాసిటి అంటారా – కాశ్మీరు యుద్ధం అప్పగిస్తే, కాశ్మీరునీ పాకిస్తాన్ న్ని కలిపి పచ్చడి చేసేసేది ప్లానింగ్ ఆవిడ స్పెషాలిటీ ఆవేళ చర్చాంశం, ఆర్నెల్ల తరవాత వచ్చే యూనివర్సరీకి ఏ కాంపిటిషను పెట్టాలి అన్నది.

"కుక్కల కాంపిటీషన్" అంది కడుపుతో వున్న ఆల్సేషియన్లాటి వైస్ ప్రెసిడెంటు.

మా ప్రెసిడెంటుని చిన్నప్పుడు కుక్క కరిచిందిట అంచేత ఆవిడ ఒప్పుకోలేదు.

ఎంబ్రాయిడరీ దగ్గర్నించీ హెయిర్ స్టైయిల్స్ వరకు అన్నీ డిస్కస్ చేసేక "గ్రీన్ తంబ్" అంది మా ప్రెసిడెంటు, అన్న తరవాత అర్థంకూడా ఆవిడే చెప్పింది.

ప్రతి మెంబరుకీ ఒక గోలెం, దాన్నిండా మన్ను, రెండు పూలమొక్కల విత్తనాలు (హోలీహాక్) క్లబ్బువాళ్ళే యిస్తారు మెంబర్లు ఆ విత్తనాల్ని క్లబ్బులోనే గోలెల్లో నాటి ఇళ్ళకు తీసుకుపోయి పెంచాలి. యూనివర్సరీ నాటికి ఎవరి మొక్క బావుంటే వాళ్ళకి ప్రైజు.

"నయం. కడుపుల కాంపిటీషన్ అనలేదు. చచ్చేదాన్ని" అది పక్కనే వున్న కమల. ఆవిడకి పెళ్ళయి పదేళ్ళయినా పిల్లల్లేరు. కాని మంచి సెన్స్ ఆఫ్ హ్యూమరుంది.

దిగులుతో నా గుండె జారిపోతున్నా, ఆవిడ జోక్‌కి నవ్వకుండా ఉండలేకపోయేను.

ఇంటికెళ్ళగానే నా మొహం చూసిన మావారు. "నువ్వు వెళ్ళింది క్లబ్బుకా? కర్మకా?" అన్నారు.

"ఏవిఁటమ్మా మీ కాంపిటిషన్" అడిగేరు పిల్లలు.

"గ్రీన్ తంబ్" అన్నాను.

"తమ్ - నాట్ తంబ్" అన్నాడు మా వారిలో ఉన్న వెబ్‌స్టరు.

"అంటే?" మా చిన్ని ఆశ్చర్యపోయేదు కాంపిటీషన్ ఏమిటో చెప్పేను.

నేను ఖూనీల కాంపిటీషనుకి వెళ్తున్నంత నిర్ఘాంతపోయేరు నా సంతానం.

అసలు సంగతేవిఁటంటే -

నేను కల్పవృక్షం కొమ్మ పట్టుకొచ్చి పాతితే అది ఎండిపోతుంది.

నా చెయ్యిపడ్డ చెట్టూ పిడుగుపడ్డ చెట్టూ ఒకటే. ఈ అపవాదు నాకు చిన్నప్పుడే వచ్చింది.

అప్పుడు నాకు నాలుగేళ్ళో ఎంతో ఉంటాయి. అన్నమ్మని ఒకర్తె ఉండేది. అది మా పక్కింటి తాసిల్దారుగారి పనిమనిషి. మా వీధికి ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజీను. దాసీపని ఆవిడ హాబీ. పురుళ్ళు పొయ్యడం, కడుపులు తియ్యడం ఆవిడ మెయిన్ వృత్తి అని తర్వాత తెలిసింది.

తాసిల్దారుగారి తోటకి వాళ్ళ పిల్లల్తోపాటే నేనూ నీళ్ళు పోసేదాన్ని సరదాకి.

ఒకసారి అన్నమ్మనీ, తాసిల్దారుగారినీ ఒక పొజిషన్లో చూసేను. అది కాంప్రొమైజింగు పొజిషన్ అని అప్పుడు నాకు తెలీదు. ఆ తర్వాత కొన్నాళ్ళకి తాసిల్దారుగారి చెట్టు పిడుగు పడి చచ్చిపోయింది. నేను నీళ్ళు పొయ్యడంవల్లే అది చచ్చిపోయిందని నాతో సహా మావీధి అందర్నీ నమ్మించేసింది అన్నమ్మ. నేను ఆడ భస్మాసురుణ్ణి అయినందుకు ఏడుస్తూ

కూర్చున్నాను. అప్పటినుంచి తాసిల్దారుగారి తోట నాకు ఔట్ ఆఫ్ బౌండ్స్.

"పోనీ మన తులసిమొక్కకి నీళ్ళు పొయ్యవే సుందర్తల్లీ" అంది మా అమ్మమ్మ నా ఏడుపు చూడలేక.

నా చేతినీరు పడిన నాలుగోనాడే నల్లబడిపోయింది తులశమ్మ.

"స్నానంచేసి మడిగా నేను నీళ్ళుపోస్తాన్లే తులసికి నీకెందుకులే శ్రమ" అంది అమ్మమ్మ.

అన్నమ్మ అన్నది నాకు అపవాదు కాదేమో అనిపించింది పెద్దయ్యాక.

మావారి ఉద్యోగరీత్యా ఏ వూళ్ళోనైనా మాకు లంకంత ఇల్లూ, సైన్యమంత జవాన్లూ ఉంటారు. నేను మూడు ఊళ్ళలో తోట పెంచాలని ట్రై చేశాను.

ఒక ఊర్లో ఒక్క విత్తనమూ మొలకెత్తలేదు. విత్తనాలు పుచ్చువన్నారు జవాన్లు. మరో ఊళ్లో కూడా మొలకెత్తలేదు విత్తనాలు. ఈసారి మన్ను మంచిది కాదన్నారు జవాన్లే. మూడోఊళ్ళో టాక్టిక్స్ మార్చేశాను. విత్తనాలైతే అచ్చిరావడం లేదని, గులాబీ మొక్కల్తో రెడీగా ఉన్న గోలేలు ఓ పాతికకొని పెంచాను. ఇరవైనాలుగు చచ్చాయి. చివరిది బోగిన్‌విల్లీలా కాగితం పూసింది అప్పుడు జవాన్లు ఏం అన్లేదు. కాని అన్నమ్మ మాట నిజం అన్నారు నా పిల్లలు.

ఆ తర్వాత వాళ్ళెప్పుడూ నన్నుకూరల బజారుకు వెళ్ళనివ్వలేదు. నేను తెస్తే ఆకుకూరలు తోవలోనూ మిగిలినవి యింటికి రాగానేనూ కుళ్ళిపోతాయి.

ఇప్పుడీ దిక్కుమాలిన కాంపిటీషన్‌కి ఖాళీ గోలెం పట్టుకొని ఏ మొహంతో వెళ్ళేది? పోనీ ఏ గేదో, మేకో మేసేసిందని అబద్ధమాడదామన్నా మేముంటున్నది మేడమీద.

చిత్రాతి చిత్రం....

నా మొక్కలు నిండా నగలు పెట్టుకున్న రాజుల పెళ్ళికూతుళ్ళలా పువ్వుల్తో ఉన్నాయి. బహు ఆరోగ్యంగా కూడా వున్నాయి.

యానివర్సరీనాడు ఫస్ట్‌ప్రైజ్ నాదే! ఆవేళ నేను భూమ్మీదలేను.

అంత బాగా మొక్కలు పెంచడం ఎలాగో చెప్పమని మెంబర్లంతా

నాచుట్టూ చేరారు. ఆ ఆనందంలో నోటికొచ్చిన బ్లఫ్స్ కొట్టేను. ఆదివారం ఉసిరిపచ్చడి మానేసినట్టు వారానికోరోజు నీళ్ళు పొయ్యవద్దన్నాను. త్రీఫైవ్స్ సిగరెట్ పీకలు రోజుకి రెండు వెయ్యమన్నాను. పువ్వులుగాని కొంచెం వాడినట్టు కనిపిస్తే రెండు ఐస్ ముక్కల మధ్య ఒక ఆస్ప్రో మాత్ర పెట్టి మొక్క మొదట్లో పాతమన్నాను ఫంక్షన్ అయిపోయేక....

పురిటిపిల్లని పట్టుకున్నట్టు ప్రైజుని పట్టుకుని యింటికి వస్తూ కార్లో ఆయన్తో "అబ్బ! నా మొక్కల్ని ఎంత మెచ్చుకున్నారో తెలుసా? యింటికెళ్ళేక యింత దిష్టితీసి పారెయ్యాలి నిజం! ఆ మొక్కలు నేను వేసినానంటే నేనే నమ్మలేకపోతున్నాను!"

"నమ్మకు" అన్నారు ఆయన తొణక్కుండా. అంటే?

"ఆ మొక్కలు నువ్వు పాతిన విత్తనంలోంచి రాలేదు."

మొగుడయేది, మహర్షయేది ఆ ప్రైజు కప్పుతో కపాలమోక్షం చేసేద్దామనిపించింది.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రిక, 12-5-1978.)*

★ ★ ★